ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 17
సంచిక : 95
పేజీలు : 4

శుక్రవారం, డిసెంబర్ 05, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## మున్సిపాలిటీ పరిధిలోకి పంచాయతీ సెక్రటరీలు

సీనియార్టీ ప్రాతిపాదికన బాధ్యతలు

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు




4లో...

## పంచాయతీ పోరు...

# మద్యం జోరు

-యథేచ్ఛగా బెల్టు దుకాణాల నిర్వహణ -అధిక ధరలకు విక్రయాలు








**టి మీడియా డిసెంబర్ 4 ,ప్రత్యేక ప్రతినిధి:**ఒకవైపు పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతుండగా.. మరోవైపు మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. పల్లెల్లో మద్యం ఏరులైపారుతున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటీ నుంచి కోడ్ అమల్లోకి వచ్చినా యథేచ్ఛగా బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు బహిరంగంగానే సాగుతున్నాయి. వైన్‌షాపులకు దీటుగా గ్రామాల్లో కిరాణా షాపులు పర్మిట్‌రూమ్‌లు, బార్‌లను తలపిస్తున్నాయి. పల్లెలు, పట్నాలు తేడాలేకుండా విచ్చలవిడిగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అధికారిక దుకాణాల కంటే బెల్టుషాపుల్లోనే అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం బెల్టు దుకాణాలు కనిపించటం లేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో 'ఎన్నికల కోడ్' వెక్కిరింతలపాలవుతున్నది. ఏదేమైనా గ్రామాల్లో అధికారులు 'బెల్టు' తీస్తేనే ఎన్నికలు ప్రశాంతంగా ముగుస్తాయని ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పల్లె పోరు జోరుమీదున్నది. ఎన్నికల సీజన్ కావడంతో మద్యంప్రియులను రాజకీయ నేతలు మద్యం, విందులతో లొంగదీసుకుంటున్నారు. గతంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపే అధికారులు ఈసారి కనీసం కన్నెత్తి చూడకపోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా బెల్టు దుకాణాల అమ్మకాలే ఎక్కువ. మద్యం దుకాణదారులు కూడా వీటిని ప్రోత్సాహిస్తూనే అమ్మకాలు పెంచుకుంటున్నారు. వీటికి అనుమతులు లేకున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోరు. ప్రభుత్వానికి మద్యం విక్రయాల ద్వారా ఆదాయం రావాలన్నా, అధికారులకు ముడుపులు అందాలన్న ఆలోచనతో బెల్టు దుకాణాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.ఇది సాధారణ సమయంలోని పరిస్థితి. జిల్లాలో వందల్లో మద్యం దుకాణాలు ఉంటే వాటి పరిధిలో బెల్టు దుకాణాలు వేలల్లో ఉంటాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అధికారులు మొదట దృష్టి పెట్టేది మాత్రం బెల్టు దుకాణాలపైనే. గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు ముందుగా బెల్టు తీస్తారు.. కానీ, ఈసారి పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 10 రోజులు దాటుతున్నా అధికారులు బెల్టు దుకాణాల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. బెల్టు వ్యాపారులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, దుకాణాలను కట్టడి చేయాల్సిన అధికారులు ఎటువంటి నియంత్రణ చర్యలు తీసుకోకపోవటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన కొత్త మద్యం దుకాణదారులు ఇంకా సిండికేట్ కాకపోయినా బెల్టు దుకాణదారులు మాత్రం అదనపు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు. క్వార్టర్‌కు రూ.20, ఫుల్‌బాటిల్‌కు రూ.80 వరకు దోచుకుంటూ దండుకుంటున్నారు.

**'బెల్టు' తీస్తేనే ప్రశాంతంగా ఎన్నికలు**

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించటానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తుంటారు. ఇందులో పోలీసుల ప్రత్యేక బందోబస్తు ముఖ్యంగా ఉంటుంది. వారికితోడు ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను కట్టడి చేయగలిగితేనే ఎన్నికలు ఎటువంటి

మిగతా 2లో

## అటవీ భూముల ఆక్రమణకు

# అనుమతించవద్దు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**టి మీడియా,డిసెంబర్ 5,ఖమ్మం:**జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాల్వల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పోరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న 100 ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన కార్పొరేషన్ సొసైటీ భూములకు సంబంధించి ప్రత్యేకంగా సర్వేయర్ లను కేటాయించి భూముల సర్వే వెంటనే చేపట్టాలని, సోమవారం నాటికి 100 ఎకరాల భూమి సిఏ కోసం బదలాయింపు ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.

పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను మభ్యపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని, రెవెన్యూ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం

మిగతా 4లో

## స్థానిక పోరులో ఎమ్మెల్యే ప్రచారం

2లో...








# స్థానిక పోరులో ఎమ్మెల్యే ప్రచారం

## - అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

## -ఎమ్మెల్యే మురళి నాయక్

**టి మీడియా ,డిసెంబర్ 4, ఇనుగుర్తి:**స్థానిక ఎన్నికలలో సర్పంచులు, వార్డు సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ ప్రజలకు పిలుపునిచ్చారు.మండలంలోని కోమటిపల్లి సర్పంచ్ అభ్యర్థి రావుల మల్లేశం,తార సింగ్ తండ నునావతు బద్రు,పెద్దతండ బానోతు పున్నమ్మ వీరన్న ,చిన్న ముప్పారం కామినేని స్వప్న సురేష్,లక్ష్మీపురం ముదిరెడ్డి కళావతి శ్రీనివాస్ రెడ్డి,చిన్న నాగారం చెడుపాక సుజాత యాకయ్య, మీట్య తండా భూక్య చిన్ని వెంకన్న,చీన్య తండ జాటోత్ శ్రీను,అయ్యగారు పల్లి మెట్టు రాజు,లాలు తండ భూక్య లక్ష్మి వెంకన్న ,ఇనుగుర్తి తమ్మడపల్లి కుమార్ లను గెలిపించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమ, పార్టీ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్, జిల్లా ప్రచార కోఆర్డినేటర్ బైరు అశోక్ గౌడ్ దిశ సభ్యులు బాబురావు,ఏఎంసి డైరెక్టర్ కొట్టం రాము లతో కలిసి ఆయా గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు ఉమ మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మరింత అభివృద్ధి కోసం సంబంధిత అభ్యర్థులను గెలిపించాలన్నారు.ఇప్పటికే ప్రభుత్వం ప్రజలకు సన్న బియ్యం,200యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు బస్సు ఫ్రీ,రుణమాఫీ,ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డులు తదితర మరెన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు.గ్రామాలలో రోడ్లు,డ్రైనేజీ, వీధిలైట్లు,నీటి సౌకర్యం, నూతన బిల్డింగులు తదితర వసతుల కల్పన కోసం పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతి ఇచ్చి ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టాలన్నారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ పార్టీ నాయకులు,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## సర్పంచ్ కు ఘన సన్మానం

**టి మీడియా డిసెంబర్ 4 ఇనుగుర్తి:**మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాత తండ కొత్త సర్పంచ్ ఇస్లావతు నరేష్ ను టీబీసీఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సొల్లేటి కిరణ్ గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తండావాసులు నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల అభినందించారు.యువ సర్పంచికికిరణ్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.కార్యక్రమం లో పొడకంటి వెంకటేశ్వర్లు,నవీన్ నాయక్ పాల్గొన్నారు.

## సింగరేణి మండలం నామినేషన్ కేంద్రాల్లో రద్దీ



**టీ మీడియా,డిసెంబర్ 04, సింగరేణి (కారేపల్లి):**సింగరేణి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ రెండో రోజు మరింత జోరుగా కొనసాగింది. ఉదయం10 గంటలకు మొదలుకొని అభ్యర్థులు, వారి అనుచరులు నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించగా, అధికారులు నామినేషన్ దస్త్రాల స్వీకరణలో తీరిక లేకుండా పని చేశారు.సాయంత్రం 5 గంటలు సమీపిస్తున్నా నామినేషన్ సమర్పించేందుకు క్యూలైన్లలో నిలబడి ఎదురు చూస్తున్న అభ్యర్థుల రద్దీ తగ్గలేదు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ తీవ్రత పెరగడంతో ప్రతి వార్డు, ప్రతి ప్రాంతం నుండి ఆశావహులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కేంద్రాల వద్ద చిన్నపాటి ఉద్రిక్తతలు లేకుండా ప్రక్రియ సాఫీగా సాగిందని అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి నామినేషన్ దాఖలు చేసిన తరువాత మండల పరిధిలో ఎన్నికల చర్చలు మరింత వేడెక్కుతున్నాయి.స్థానిక ప్రజల్లో కూడా ఎన్నికల హాట్ టాపిక్‌పై చర్చలు ప్రారంభమయ్యాయి.

## పంచాయతీ పోరు

ఘర్షణలు లేకుండా సజావుగా సాగుతాయి. రాత్రి 10 గంటకే మద్యం దుకాణాలు మూతపడతాయి. అప్పటినుంచి బెల్టు దుకాణాల హవానే కొనసాగుతోంది. బెల్టు దుకాణాల్లోనే మద్యం 24 గంటలు అందుబాటులో ఉంటుంది. పీకల్లోతుగా తాగిన తర్వాత గొడవలు చోటుచేసుకుంటాయి. ఇది మితిమీరిన ఘర్షణలకు దారితీసే ప్రమాదమూ ఉంటుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అన్ని కార్యక్రమాలు ఎన్నికల సంఘం నియంత్రణలోకి వచ్చేస్తాయి.అప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే అధికారులు ఎన్నికల సంఘం నిబంధనల అమల్లోకి వచ్చేస్తారు. వాహనాల తనిఖీ, నగదు రవాణాపై దృష్టి సారిస్తున్న అధికారులు బెల్టు దుకాణాలకు మద్యం సరఫరాపై ఎందుకు ఫోకస్ పెట్టడం లేదో అర్థంకావడం లేదు. పల్లెల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నా కనీసం కన్నెత్తి చూడకపోవడంతో అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు అధికారుల కనుసన్నల్లోనే బెల్టు దుకాణాలు సైతం కొనసాగుతున్నాయనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా సాగాలంటే బెల్టు తీయాల్సిందేనన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తున్నది. లేకుంటే జరగబోవు పరిణామాలకు అధికారులే బాధ్యులవుతారంటూ హెచ్చరిస్తున్నారు.



## గంజాయి కేసులో 20 ఏండ్ల జైలు, రూ.లక్ష జరిమానా

**టి మీడియా డిసెంబర్ 4 ,ఖమ్మం రూరల్ :** గంజాయి రవాణా కేసులో దోషిగా తేలిన వ్యక్తికి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు.. 19 జనవరి, 2024న ఖమ్మం పట్టణంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గల ఆటో స్టాండ్ వద్ద అప్పటి ఎక్సైజ్ డీటీఎఫ్, ఖమ్మం సీఐ ఆర్.విజేందర్, ఎస్ఐ ఎల్.అచ్చారావు, ఇతర పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన రాజస్థాన్‌కు చెందిన భాగ్ చంద్ బైర్వా(31), పింట్ కుమార్ రేగర్(24) ను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 22.150 కేజీల ఎండు గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని బైర్వాను ఏ1గా, రేగర్‌ను ఏ2గా పేర్కొంటూ ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా విచారణ అనంతరం సదరు వ్యక్తులను న్యాయస్థానం దోషులుగా ప్రకటించింది. దీంతో కోర్టు ఏ1గా ఉన్న బైర్వాకు 20 ఏండ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించింది. ఏ2 రేగర్ పరారీలో ఉండగా నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.



## విధుల నిర్వహణపై అధికారుల సమీక్ష

**టి మీడియా, డిసెంబర్ 4, నెల్లికుదురు:**మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎక్స్పెండిచర్ అబ్జర్వర్,నోడల్ ఆఫీసర్ స్థానిక తహసిల్దార్ చంద నరేష్, ఎంపీడీవో సింగారపు కుమారులతో కలిసి అన్ని ఫీల్డ్ టీమ్స్ తో విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఎన్నికల ప్రక్రియలో ఖర్చుల పర్యవేక్షణ, బృందాల బాధ్యతలు, అమలు జరుగుతున్న విధానాలు,అవసరమైన ఏర్పాట్లపై వివరంగా చర్చించారు.బృందాలు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

## దేవరపల్లి కల్వర్టు నిర్మాణ శంకుస్థాపన

**టీ.మీడియా,డిసెంబర్4,చింతూరు:**గూడూరు పంచాయతీ పరిధిలోని దేవరపల్లి గ్రామంలో చాలాకాలంగా కొనసాగుతున్న రాకపోకల సమస్యలను నివారించేందుకు కల్వర్టు నిర్మాణ పనులకు ఈ రోజు శంకుస్థాపన నిర్వహించబడింది. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గౌరవ సర్పంచ్ శ్రీమతి మడవి బుజ్జి, ఎంపిటిసి శ్రీమతి సున్నం గౌరమ్మ, పీసా ఉపాధ్యక్షుడు శ్రీ కూర సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీ గొల్లు అమృతరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ దేవరపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తయ్యిన తరువాత గ్రామ ప్రజలకు సురక్షితమైన, సులభమైన రాకపోకలు లభిస్తాయని పేర్కొన్నారు.



## కారేపల్లి ఘనంగా ఇరుముడి వేడుక

### అన్నదానం ప్రారంభించిన ప్రెస్ క్లబ్ సభ్యులు

**టీ మీడియా,డిసెంబర్ 04, సింగరేణి (కారేపల్లి) :** కారేపల్లి సింగరేణి కమ్యూనిటీ హాల్ అయ్యప్ప పీఠం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. 35 మంది మాలధారులు ఇరుముడి కట్టుకోని అయ్యప్ప దర్శనానికి బయులుదేరారు. ఈసంధర్భంగా అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు పగడాల నాగేశ్వరరావు, తేళ్ల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరపతిరావు, మేదరి వీరప్రతాఫ్(టోనీ)లు ప్రారంభించారు. మంచి నడవడిక, క్రమశిక్షణకు అయ్యప్ప మాలదారణతో అలవర్చుకోవచ్చాని వారు తెలిపారు. ఈసందర్బంగా నిత్య అన్నదానానికి సహకరించిన ఓరుగంటి రంగనాథ్, మేదరి వీరప్రతాప్(టోనీ) లను సన్మానించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు పాలిక సారయ్య, గుగులోత్ రాందాస్, సంగు సాయి, కేతిమళ్ల శ్రీను, పాలిక శ్రీను, కట్ట రమేష్, దంతాల వెంకట్, పాలిక రమేష్, జిట్టబోయిన శ్రీను, ముక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన శ్రీజ

**టీ మీడియా,డిసెంబర్ 04, సింగరేణి (కారేపల్లి):** సింగరేణి మండలంలో నామినేషన్ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ గురువారం పరిశీలించారు. సింగరేణి మండలంలో మూడోవిడుత ఎన్నికల కు సంబంధించి ఏర్పాట్లపై స్థానిక అధికారులతో సమీక్షించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని ఆమె పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగేలా చూడాలని దానికి సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, కారేపల్లి ఎస్ఐ బైరు గోపి ,గ్రామ పంచాయతీ కార్యదర్శులు నెహ్రూ,కృష్ణవేణి లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెటీరియల్ పంపిణి

**టి మీడియా ,డిసెంబర్ 4, ఇనుగుర్తి:**మండలంలోని కోమటిపల్లి జడ్పీహెచ్ఎస్ 10వ, తరగతి విద్యార్థులకు అదే బడిలో 2013-14 విద్యా సంవత్సరం టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పుస్తకాలు, పరీక్షా ప్యాడులు గురువారం పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆ పాఠశాల హెచ్ఎం కళ్లెం వెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు. పూర్వవిద్యార్థులు మెటీరియల్ బహుకరించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





## నూతన డిడిఓ కార్యాలయం ప్రారంభం

### ఏజెన్సీ ప్రజలకు పరిపాలన సౌలభ్యం

**టీ.మీడియా,డిసెంబర్4,చింతూరు:**ఏజెన్సీ విలీన మండలాల్లో డివిజన్ అభివృద్ధికి దోహదపడే విధంగా నూతన డి డి ఓ భవనాన్ని గురువారం ప్రజాప్రతినిధులు అధికారులు సమక్షంలో లాంచనంగా ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధి పనులు జరిగేందుకుగాను సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ భవనాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు ప్రజలు అందుబాటులో ఉన్న డి డి ఓ కార్యాలయానికి వచ్చి సేవలను వినియోగించుకోవాల్సింది ఉంటుందని డివిజన్ వ్యాప్తంగా ఉన్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా ఉంటూ అభివృద్ధికి దోహదపడుతుందని తెలియజేశారు. నూతన భవనానికి ప్రారంభోత్సవంగా స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనగా ఈ కార్యక్రమంలో నూతన డి డి ఓ విజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు సర్పంచ్ కారం కన్నారావు, జడ్పిటిసి చిచ్చడి మురళి. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్, మాజీ మండలాధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, జనసేన అధ్యక్షులు మడివి రాజు, బిజెపి అధ్యక్షులు బట్ట లక్ష్మణ్ రాజు , సాల్మన్ రాజు, విలీన నాలుగు మండలాల ఎంపీడీవోలు అధికారులు, వివిధ సర్పంచులుఎంపీడీవోలు తదితులు పాల్గొన్నారు.



## మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు

### -యువత భారీ ర్యాలీ

**టీ.మీడియా.డిసెంబర్4.చింతూరు:**అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్.. కేంద్రంలోగురువారం మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజన యువత భారీ ర్యాలీ నిర్వహించారు. మావోయిజం వద్దు అభివృద్ధి ముద్దు, ఇన్ ఫార్మర్ల నెపంతో అమాయకులను చంపొద్దు నినాదాలు చేశారు. చింతూరుబస్టాండ్ నుండి మెయిన్ సెంటర్ మీదుగా చింతూరు శబరి బ్రిడ్జి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అమాయకులైన ఆదివాసీలను ఇన్ఫార్మర్ల నేపంతో హత్యలు గావిస్తున్న మావోయిస్టులను పూర్తిగా వ్యతిరికించారు. అభివృద్ధికి అడ్డుపడుతూ అనేక విధ్వంసాలకు పాల్పడుతున్నారని దీని వలన గిరిజన గ్రామాలకు రోడ్డు,బస్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సమాచార ప్రతినిధులుగా గిరిజనులను మట్టు పెడుతున్నారంటూ ఇది అన్యాయమని నినాదాలు చేశారు. వారి ఉనికిని చాటుకోవటానికి దారి వెంట వస్తువెళుతున్న వాహనాలను దగ్ధం చేయటం, రోడ్డు నిర్మాణానికి వచ్చిన యంత్రాలను తగలబెట్టడం మంచిది కాదని మారు మూల గ్రామాలకు దీని ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేరడం లేదని నినాదాలు చేశారు. మావోయిస్టుల సిద్ధాంతాలకు, ప్రభావాలకు లొంగకుండా ప్రజా సంక్షేమానికి పాటుపడాలని మావోయిస్ట్ పీపుల్స్ లిబరేషన్ గేరిల్లా ఆర్మీ వారోత్సవాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మారుమూల గ్రామ గిరిజన యువతతో పాటు, స్థానిక యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో

## రెండో రోజు 292 నామినేషన్లు

**కారేపల్లి:** సింగరేణి మండలలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు 292 నామినేషన్లు దాఖలైనట్లు సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్ స్థానానికి 77 నామినేషన్లు, వార్డు లకు 215 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.



# సేవే లక్ష్యం- గ్రామాభివృద్ధే గమ్యం

### తెల్లవారుజాము నుంచే ప్రచారం

**టీ మీడియా, డిసెంబర్ 4, అశ్వాపురం:**ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే, సమస్యలు ఓపికగా విని, పరిష్కారం కోసం పరిగెత్తే వ్యక్తి అయిన సదర్ లాల్ అని పార్టీకి కాదు ప్రజలకు ఉపయోగపడే నాయకుడిగా ముందుకొచ్చారు అని ఊరూ వాడ కొనియాడుతున్న కాంగ్రెస్ పార్టీ మరియు తెలుగుదేశం పార్టీలు బలపర్చిన అశ్వాపురం సర్పంచ్ అభ్యర్థి సదర్ లాల్.అశ్వాపురం గ్రామంలో ప్రతి ఇంటికి తెలిసిన నాయకుడు, అభివృద్ధికి కట్టుబడి ఉన్న వ్యక్తి,చిన్న ,పెద్ద అని తేడా లేకుండా అందరిని తల్లి, చెల్లీ, అన్న , బాబాయ్ అని అందరికీ అందుబాటులో ఉండే మనిషి. పేదల కోసం, వృద్ధుల కోసం, యువత కోసం నిజంగా పని చేసిన సేవా తత్పరతగ్రామానికి కావలసిన నిధులు పథకాలు తెచ్చే సామర్థ్యం ఉన్న అనుభవజ్ఞుడు అని అశ్వాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి సదర్ లాల్ ని, ఈ నెల పదకొండో తేదీన జరుగుతున్న ఎన్నికల్లో ఫుట్ బాల్



గుర్తు కి ఓటు వేసి అఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నారు.తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాసన సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరియు డి సి సి బి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య గారి ఆదేశాలతో గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు.ప్రలోభాలకు లొంగొద్దని పనిచేసే నాయకుడిని స్వార్థం లేని నాయకుడిని ఎన్నుకోవాలని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత,వార్డు అభ్యర్థులు వేములపల్లి అశ్రిత,కొమరం కౌసల్య,గుర్రం త్రివేణి, చిట్టూరి భాస్కర్, నూకల లింగయ్య,సవలం అనిల్, నాయకులు వేములపల్లి రమేష్, షేక?ధీర్, బూతంవెంకటేశ్వర్లు, తాడబోయిన వెంకటేశ్వర్లు, వలబోజు మురళీకృష్ణ, టీ డీ పి వాసు,ఇలాసాగరపు వరప్రసాద్, హరీష్, చుంచు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.





## 5వ వార్డ్‌కు భాగం నాగేశ్వరరావు నామినేషన్

**టీ మీడియా,డిసెంబర్ 4, సింగరేణి (కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం సింగరేణి గ్రామపంచాయతీలో జరుగుతున్న స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఐదవ వార్డుకు గురువారం స్వతంత్ర అభ్యర్థిగా భాగం నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సంబంధిత పత్రాలను సమర్పించిన అనంతరం భాగం నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ%ొ% ఈసారి జనరల్ వార్డులో తొలిసారిగా పోటీ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉందని చెప్పారు. వార్డు అభివృద్ధి, శుభ్రత, డ్రైనేజ్ సమస్యల పరిష్కారం, పల్లెప్రగతి కార్యక్రమాల అమలులో మరింత చురుకుదనం చూపేందుకు అవకాశం ఇవ్వాలని 5 వ వార్డు ప్రజలను కోరారు. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు.

# భద్రాద్రిలో 'మానే' విస్తృత ప్రచారం

**టి మీడియా డిసెంబర్ 4 ,భద్రాచలం :** భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ స్థానం దాదాపు బీఆర్ఎస్ పరమైనట్లేనని, ప్రజల ఆశీర్వాదాన్ని చూస్తే అలాగే అనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్, సిపిఎం, గోండ్వానా దండకారణ్య పార్టీ, ఆదివాసి జేఏసీ సంయుక్త కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ బలపరుస్తున్న మానే రామకృష్ణ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. పట్టణంలో నిర్వహిస్తున్న ప్రచారానికి పెద్ద ఎత్తున ప్రజల నుండి స్పందన లభిస్తోంది. గురువారం భద్రాచలం పట్టణంలోని 9, 11, 18, 19, 20 వార్డుల్లో మానే రామకృష్ణ సుడిగాలి పర్యటన చేశారు. ఆయా వార్డుల్లో ప్రజలు మానేకు బ్రహ్మరథం పట్టారు.

**భద్రాచలాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతా..**

ఈ సందర్భంగా మానే మాట్లాడుతూ.. తనకు సర్పంచ్‌గా అవకాశం ఇస్తే భద్రాచలం పట్టణాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతానని వెల్లడించారు. ఎప్పటికప్పుడు సమస్యలను తక్షణమే పరిష్కరించి భద్రాద్రి పుణ్యక్షేత్రం అంగరంగ వైభవంగా ఉండేలా శక్తి వంచన మేరకు కృషి చేస్తానని తెలిపారు.

**మానే గెలుపు అభివృద్ధికి మలుపు : రావులపల్లి రాంప్రసాద్**

బీఆర్ఎస్ అభ్యర్థి మానే రామకృష్ణ గెలుపు అభివృద్ధికి మలుపు అని బీఆర్ఎస్ సీనియర్ నేత రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని లంబాడి కాలనీ, రిక్షాకాలనీ, జగదీష్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార సరళిని ఆయన పరిశీలించారు. నాయకులకు, కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని కొందరు ధన దాహంతో కుట్రలకు ప్రయత్నిస్తున్నారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానే గెలుపు తథ్యమని దీన్ని ఎవరు ఆపలేరని ఆయన స్పష్టం చేశారు.





## మాజీ సర్పంచ్‌తో పాటు

### 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

**టి మీడియా ,డిసెంబర్ 4 , ఇల్లెందు :** ఇల్లెందు మండలం రొంపేడు గ్రామానికి చెందిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మాజీ సర్పంచ్ అజ్మీర శంకర్‌తో పాటు 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమ నేత, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ అజ్మీర భావ సింగ్ ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ హరిప్రియ నాయక్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందిన తీరును చూసి, భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని, కేసీఆర్ పాలనలో గిరిజన తండాలను, గుడాలను పంచాయితీలుగా చేసి అభివృద్ధి చేసిన విధానంపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని ఆమె అన్నారు.కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనలో ప్రజలు విసుగు చెంది మళ్లీ కేసీఆర్ కావాలని బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుండి అత్యధికంగా స్థానాలను బీఆర్ఎస్ కైవస్యం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు అజ్మీర జోగ్య, మూడ్ బలరాం, శారద, వాంకుడోత్ రవి, అజ్మీరా రవి, కిరణ్, పద్మ, ధర్మసోద్ లక్ష్మి, శిరీష, మారి, బద్రి ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజ్మీర రాంబాబు, మూడ్ హనుమాన్, గుగులోత్ సోమన్న, బానోత్ మోతిలాల్ పాల్గొన్నారు.

### సర్పంచ్ పదవికి నామినేషన్

## దాఖలు చేసిన నరేందర్ నాయక్

**టి మీడియా, డిసెంబర్ 4,మహబూబాబాద్:**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండ ధర్మారం గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి ప్రముఖ రైతు, కీర్తిశేషులు భీమా నాయక్ కుమారుడు నరేందర్ నాయక్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధికి నూతన దిశ చూపించేందుకు తాను కట్టుబడి ఉన్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.గ్రామ ప్రజల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, ఆధునిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని పనిచేస్తానని నరేందర్ నాయక్ హామీ ఇచ్చారు. ప్రజలతో మరింత అనుసంధానం పెంచుకుంటూ, గ్రామాభివృద్ధి కోసం తాను ప్రత్యేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.గ్రామ ప్రజల ఆశీస్సులు, మద్దతు తనకు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేసిన నరేందర్ నాయక్, ఎన్నికల విజయంతో తండ ధర్మారాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ధ్యేయమని తెలిపారు.





## పేరూరు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

**టి మీడియా,డిసెంబర్ 5,వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు మాజీ సర్పంచ్ యాలం సరస్వతి బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు కాకర్లపూడి కళ్యాణ్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం ఆమెతోపాటు 20 కుటుంబాల ప్రజలు చేరారు. కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పేరూరు మాజీ సర్పంచ్ యాలం సరస్వతికి దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన సరస్వతి కుటుంబానికి అన్నివేళల కాంగ్రెస్ పార్టీ అండదండలుగా నిలుస్తుందని పేరూరు పంచాయతీ కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి మెలిసి అందరిని కలుపుకొని పోయి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లె వెంకన్న నల్లగా రమేష్ కురుసం కృష్ణమూర్తి ఆనందరావు బొల్లె నరేష్ గార రాంబాబు తోటపల్లి ఎల్లయ్య కోరం పగిడయ్య అరికిల్ల రఘుపతి అరికెల చిన్న సమ్మయ్య తల్లడి శ్రీకాంత్ నవీన్ యాదవ్ ఎర్రావుల నరేష్ తూనూరు జయస్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని శృతికి "తానా" ప్రశంసలు

**టి మీడియా,డిసెంబర్ 5,అశ్వారావుపేట:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా ఆదివారం 13 గంటలపాటు అంతర్జాలంలో నిర్వహించిన అంతర్జాతీయ వేదిక బాల సాహిత్య భేరి లో అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కంబంపాటి శృతి పాల్గొని చిరు స్వరాలు గేయ సంకలనంలో బాల రచయిత్రి సిద్ధాంతపు పూజిత శ్రీ వ్రాసిన మనిషి మారాలి గేయాన్ని ఆలపించి తానా నిర్వాహకుల ప్రశంసలు అందుకుంది. తానా ప్రపంచ సాహిత్య వేదిక కన్వీనర్ ప్రసాద్ తోటకూర,తానా పాఠశాల అధ్యక్షులు భాను ప్రకాష్,సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ , శాంతా బయోటిక్స్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ వర ప్రసాద రెడ్డి, మలేషియా తెలుగు సంఘం నిర్వాహకులు ముల్లాల సత్యా దేవి, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తెలంగాణా సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, ప్రముఖ బాల సాహితీ వేత్తలు డి.కె.చదువులు బాబు,పైడిమర్రి రామకృష్ణ వంటి ఉద్దండులు శృతి గేయాలాపన ను ప్రశంసించారు. గురువారం తానా పంపిన ప్రశంసా పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు, అభినందనలు తెలిపారు.

# కలెక్టరేట్ లో ప్రతిష్టాపనకు తెలంగాణ తల్లి విగ్రహం

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-చివరి దశలో నిర్మాణ పనులు..**

**టి మీడియా,డిసెంబర్ 05,ఖమ్మం:** కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధమవ్వుతుందని, విగ్రహ ప్రతిష్టాపన పనులు ముమ్మరంగా నడుస్తూ చివరి దశకు చేరాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ ఆవరణ నందు ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. కలెక్టరేట్ కు మరింత ఆకర్షణ వచ్చే విధంగా విగ్రహ ఏర్పాటు ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి రాష్ట్ర సాంస్కృతిక చిహ్నమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టరేట్ నందు ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని అన్నారు. విగ్రహ ప్రతిష్టాపన పనులు ముమ్మరంగా నడుస్తుండగా చివరి దశకు చేరాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం 33 జిల్లాల్లోని కలెక్టరేట్ల ఆవరణలోనూ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారని, రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉండే తెలంగాణ తల్లి తరహాలో విగ్రహం 12 అడుగులు, పీఠం 2 అడుగులు, దిమ్మె 4 అడుగులతో కలిపి మొత్తంగా 20 అడుగుల ఎత్తు కలెక్టరేట్ విగ్రహం ఉండనుందని అన్నారు. సబ్బండ వర్గాల ఆకాంక్షలకు స్ఫూర్తిగా సంప్రదాయ పల్లెటూరి మహిళా రైతుగా, స్త్రీ మూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని వివరించారు.ఖమ్మం కలెక్టరేట్ లో ప్రతిష్ఠించబోయే తెలంగాణ తల్లి విగ్రహం వివిధ పనులపై వచ్చే



ప్రజలను మరింతగాఆకట్టుకుంటుందని, పనుల నాణ్యతలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా విగ్రహ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత ఇంజనీర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి

**టి మీడియా,డిసెంబర్ 5,కొత్తగూడెం :** సింగరేణి సంస్థలో పని చేసి పదవీవిరమణ పొంది పెన్షన్ పొందే, సిపిఆర్ఎంఎస్ స్కీమ్ ద్వారా హెల్త్ కార్డ్ పొందిన ఉద్యోగులు, 2026 సంవత్సరానికి గాను సిఎంపిఎఫ్ పెన్షన్ పొందుటకు సిపిఆర్ఎంఎస్ హెల్త్ కార్డ్ రెన్యువల్ కొరకు, ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించాలి. కానీ ఇప్పటివరకు చాలా మంది మాజీ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించలేదు. ఇప్పటి వరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని సింగరేణి మాజీ ఉద్యోగులు, తమ మొబైల్ ఫోన్ లోని జీవన్ ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్ ఆధార్ ఫేస్ ఆర్ డి ఆండ్రాయిడ్ అప్లికేషన్ల ద్వారా, లేదా స్వయంగా సిఎంపిఎఫ్/సిపిఆర్ఎంఎస్ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని, లేదా దగ్గరలోని మీసేవా కేంద్రం వద్దనైనా సమర్పించి, నిరాటంకమైన పెన్షన్, వైద్య సేవలు పొందవలసినదిగా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %డ% సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్ పత్రికా ప్రకటనలో భాగముగా తెలియజేశారు.



## కాంగ్రెస్ సర్పంచ్ గా పాయం స్వాతి నామినేషన్

**- హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య..**

**టి మీడియా,డిసెంబర్ 5,ఇల్లెందు:** ఇల్లందు మండలం బాలాజీనగర్ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పాయం స్వాతి, ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, బాలాజీ నగర్ ఇంచార్జ్ మడుగు సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల రాము, మండల ప్రెసిడెంట్ పులి సైదులు, హరిహర క్షేత్రం చైర్మన్ గాందే సదానందం, వాసం రాములమ్మ, బాల సత్యనారాయణ చిల్లా శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.



## మున్సిపాలిటీ పరిధిలోకి

# పంచాయతీ సెక్రటరీలు

**సీనియార్టీ ప్రాతిపాదికన బాధ్యతలు**

**సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు**

**టి మీడియా డిసెంబర్ 4 ,ఖమ్మం రూరల్ :** ఇంతకాలం పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో పంచాయతీ సెక్రటరీలుగా విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సెక్రటరీలను మున్సిపాలిటీ పరిధిలోకి బదలాయిస్తూ రాష్ట్ర సీడీఎంఏ కమిషనర్ కె.నారాయణ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసిన క్రమంలో తాత్కాలికంగా పంచాయతీ సెక్రటరీలు మున్సిపల్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోకి విల్లింగ్ ఆప్షన్ ఇచ్చిన సెక్రటరీలను మున్సిపాలిటీ పరిధిలోకి బదలాయించారు. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోకి 9 మంది పంచాయితీ సెక్రటరీలను బదలాయించడం జరిగింది.ప్రస్తుతం వారి సీనియారిటీకి అనుగుణంగా మున్సిపాలిటీలో హోదాలో కల్పించారు. గ్రేడ్ వన్ సెక్రటరీ కె.శ్రీధర్ రెడ్డిని, రెవెన్యూ ఆఫీసర్ గా గ్రేడ్ 2 సెక్రటరీగా ఉన్న పిల్లి శ్రీనివాస్, నల్లబెల్లి రఘులను సెక్షన్ ఆఫీసర్లుగా, గ్రేడ్ 3 సెక్రటరీ ఏదునూతల సువర్ణ, ఉమా జూనియర్ అసిస్టెంట్ గా, గ్రేడ్ 4 సెక్రటరీలైన కొక్కుల నరేష్, దామల కిరణ్, ధారావత్ శిరీష, పగిడిపల్లి ఉషారాణి, కేలావత్ మధు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లుగా అవకాశం కల్పించారు. మొత్తం తొమ్మిది మంది మున్సిపాలిటీ పరిధిలోకి రాగా మిగిలిన సెక్రటరీలు కొద్ది రోజుల్లో ఇతర పంచాయతీ సెక్రటరీలుగా బదిలీ కానున్నారు.

## యాత్రికులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**ఆహార భద్రత జిల్లా అధికారి శరత్**

**టి మీడియా డిసెంబర్ 4 , భద్రాచలం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ముక్కోటి ఏకాదశి అధ్యయన ఉత్సవాలు, తెప్పోత్సవం ఉత్తర ద్వారా దర్శనం మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున భద్రాచలం పట్టణంలోని హోటళ్లలో నాసిరకమైన ఆహార వస్తువులు భక్తులకు అందించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు జిల్లా ఆహార భద్రత అధికారి శరత్ అన్నారు. గురువారం పట్టణంలోని దేవస్థానం, బ్రిడ్జి సెంటర్, కూనవరం రోడ్డులోని హోటల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి హోటల్లో కస్టమర్లకు తయారుచేస్తున్న వివిధ ఆహార పదార్థాలను తయారీ కోసం సిద్ధం చేసిన 10 కేజీల చికెన్, 20 కేజీల టమాటో గ్రేవీ, 5 కేజీల చిల్లి గ్రేవీ, 12 కేజీల రెడ్డి చెల్లి గ్రేవీని ఎటువంటి భద్రతలు లేకుండా వంట గదిలో ఉంచడంతో వాటిని యాక్ట్ నామూనాలు, సర్వే లైన్ నమూనాల కోసం శాంపిల్స్ తీసుకొని హోటల్ యజమానులకు మెరుగుదల నోటీసులు జారీ చేయడం జరిగిందని అన్నారు.

## అటవీ భూముల ఆక్రమణకు

కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ జంతువులను వేటాడితే 25 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. పోడు భూముల పట్టా ఉన్నవారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడిన, అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11 కేవి లైన్ లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. నీలాద్రి అర్బన్ పార్క్ పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్క్ కాంపౌండ్ దూకి రోడ్డు పైకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయని, పార్క్ కాంపౌండ్ వాల్ ఎత్తును వీలైనంత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఎఫ్.ఆర్.ఓ. దగ్గర ఉండి అవసరం మేరకు నిర్మాణ పనులు జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. నీలాద్రి, వెలుగుమట్ల, పులిగుండాల అర్బన్ పార్క్ లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యువత, పిల్లలను ఆకర్షించేలా అర్బన్ పార్క్ లో జంతువులను ఏర్పాటు చేయాలని అన్నారు. నైట్ సఫారీ ఏర్పాటు అవకాశాలు పరిశీలించాలని అన్నారు.అటవీ ప్రాంతంలో జరిగే నిర్మాణాలలో తప్పని సరిగా డ్యూరబుల్ పరికరాలు వినియోగించాలని అన్నారు. గ్రామం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు కోతుల సమస్య ఉందని అన్నారు. రోడ్డుపై ఎక్కడ కూడా కోతులకు ఆహార పదార్థాలు ఇవ్వవద్దని, దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు, బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూలి గిరిజనులు సాగుచేసే భూములకు ప్రభుత్వం అందించిన పోడు పట్టాలు ఎట్టి పరిస్థితుల్లో విస్తరించడానికి వీలు లేదని, పోడుపట్టాల్లో సమీపంలో ఉన్న అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ భూముల బండ్ లపై ఉపాధి హామీ క్రింద గచ్చకాయ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, వ్యవసాయ, హార్టికల్చర్, అగ్నిమాపక, విద్యుత్, మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పాల్గొన్నారు.